క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న అధికారులు

మల్యాల: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలతో, గుడిపేట, ముత్యంపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్ బుధవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, ర్యాంపులు, పోలింగ్ కేంద్రాల్లోని మౌలిక వసతులు పరిశీలించారు. ఆయన వెంట మల్యాల మండల తహసీల్దార్ పెద్దపల్లి మునీందర్, చొప్పదండి తహసీల్దార్ జె.నరేందర్, ఎంపీడీవో వేంకటేశం, ఆర్‌ఐ తిరుపతి, కార్యదర్శి దాసరి రవీందర్ తదితరులు ఉన్నారు.

నాగులపేటలో బీఆర్‌ఎస్ నాయకుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేటలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కు మద్దతుగా నాయకులు బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ శివారులోని నాగులమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సింగిరెడ్డి నర్సారెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ. ఖయ్యూం,నాయకులు నాగరాజు, సుధాకర్, నారాయణ రెడ్డి,లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

కోరుట్ల: పట్టణ బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎండీఅమీర్ బీఆర్‌ఎస్ పార్టీ పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం తెలిపాడు. బీఆర్‌ఎస్ ముస్లింలను పట్టించుకోవటం లేదని అందుకే రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నాడు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి

కథలాపూర్: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం, ఏసీబీ అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయించాలని సీసీఆర్ సంస్థ ప్రతినిధి మల్లేశ్ కథలాపూర్ తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ప్రతీ శాఖలోని అధికారి ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని, అప్పుడే సామాన్యులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరుతాయన్నారు. అన్ని శాఖల అధికారులు బోర్డులు ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

భూషణరావుపేటలో ముగ్గుల పోటీలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బాలికలకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 25 మంది మహిళలు పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. ఆకట్టుకునే విధంగా వేసిన ముగ్గులను ఎంపిక చేసి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూన సులోచన, బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం దుర్గాదేవి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్, కండ్లపల్లి, మంగేళ గ్రామాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. విచిత్రవేషాధారణలతో యువకులు భక్తులను అలరించారు. దుర్గాదేవి దీక్షాపరులు, అర్చకులు , నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు డీజే సౌండ్‌లతో ఊరేగించి, అమ్మవారిని చెరువులు, కుంటలో నిమజ్జనం చేశారు.

మాట..వేట..



- వెంటాడుతున్న ట్యాపింగ్ భయం
- శబ్ద సందేశాలపై అప్రమత్తం
- ఫోన్ మాట్లాడాలంటేనే జంకుతున్న నాయకులు
- కార్యకర్తల్లోనూ అదే భయం

పెగడపల్లి: సెల్‌ఫోన్లతో ఎన్ని అనుకూల అంశాలు ఉన్నాయో అన్ని ప్రతికూల అంశాలూ ఉన్నాయి. అవే ఇప్పుడు రాజకీయ నాయకులను కలవరపెడుతున్నాయి. ఎన్నికల సీజన్ కావడంతో ఎవరితో ఏం మాట్లాడితే ఏమవుతుందోనని జంకుతున్నారు. ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారేమోనని అనుమానం ఇప్పుడు నియోజవర్గ, గ్రామస్థాయి నాయకులను వెంటాడుతోంది. ప్రధాన పార్టీల్లో తిరిగే నాయకులు, ఓటర్లను ప్రభావితం చేస్తారని భావించే వ్యక్తుల ఫోన్లకు నిఘావర్గాలు కన్నేసి ఉంచుతున్నాయనే పుకార్లు షికారు చేస్తున్నాయి. నాయకులు, కార్యకర్తలు ఒకరితో ఒకరు మాట్లాడుకునే సమయంలో వాయిస్ కాల్స్‌ను ఎవరైనా బహిర్గతం చేస్తే పరువు పోతుందని, ప్రలోభాలకు గురిచేసే సమయంలోనూ ఆచితూచి ఫోన్ మాట్లాడుతున్నారు.

అభ్యర్థుల అనుచరగణంపైనే అందరి కన్ను

ఎన్నికల సందడి రోజురోజుకు వేడెక్కుతుంది. వ్యూహాలతో అభ్యర్థుల సమీకరణలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బలం బలహీనతలపై అంచనా వేసుకుంటున్నారు. ఓట్లను ప్రభావితం చేసే ఎదుటి పార్టీలోని ద్వితీయ శ్రేణీ నాయకులను, క్రియాశీలక కార్యకర్తలకు గాలం వేస్తున్నారు. ధర్మపురి నియోజవర్గంలో నేరుగా అభ్యర్థులే లైనులోకి వస్తున్నారు. పార్టీలోకి వస్తే సముచిత స్థానం ఇస్తామని మభ్య పెడుతున్నారు. నయానో బయానో దారిలోకి తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక ప్యాకేజీలతో ఆఫర్ ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో సెల్‌ఫోన్లో జరిపే సంభాషణ బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడ బయటకు లీక్ అవుతుందోనని అనుక్షణం అప్రమత్తమవుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో కీలకంగా ఉండేవారు, అభ్యర్థులకు అత్యంత సన్నిహితంగా ఉండేవారైతే ప్రత్యర్థి పార్టీ వారి ఫోన్ లిఫ్ట్ చేయాలంటేనే జంకుతున్నారు.

నిధులు..విధుల విషయంలోనూ..

ప్రధాన పార్టీల అభ్యర్థులు నిధులు సమీకరించుకోవడంలో.. ఎన్నికల ప్రచారంలో విధులు పంచుకోవడంలోనూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలకు తమ ప్రణాళికలు, వ్యూహాలు బయటపడకుండా చూసుకుంటున్నారు. పోలింగ్ నాటికి అవసరమయ్యే ఖర్చులను ఎవరికెంత పంపాలనేది కూడా రహస్యంగానే సమాచారాన్ని చేరవేస్తున్నారు. అత్యంత నమ్మకస్తులతోనే వ్యవహారాలు నడిపిస్తున్నారు. అడుగడుగునా జరుగుతున్న వాహనాల తనిఖీలు, ఎన్నికల అధికారుల నిఘా నేపథ్యంలో అన్నీ పార్టీల్లోనూ గోప్యతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. చివరకు నాయకులు, కార్యకర్తలు కూడా ఒకరినొకరు సంభాషించుకునే సమయంలో అత్యంత జాగ్రత్త తీసుకుంటున్నారు. ఈ నోటా ఆ నోటా తమ పేరు బయటకు వస్తే పార్టీలో ప్రాధాన్యం తగ్గుతుందని తోటి నాయకుల్లో చులకన అవుతామని చూస్తున్నారు. కనీసం పార్టీ ప్రచారంలో వెనుకబడిందనో లేక ఆదరణ తగ్గుతుందనే విషయాలు కూడా బాహాటంగా బయట పెట్టేందుకు వణికిపోతున్నారు. పక్కపక్కన మాట్లాడుకునే సమయంలోనూ ఫోన్ ఎవరిది ఎక్కడ ఆన్‌లో ఉందనే దానిపైన దృష్టి పెడుతున్నారు. మొత్తం మీద ఎన్నికలయ్యేంత వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండి క్షేమంగా గట్టెక్కాలనుకుంటున్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

- బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి



రాయికల్‌లో ప్రచారం చేస్తున్న శ్రావణి

రాయికల్: బీజేపీతోనే గ్రామాలు,పట్టణాలు అభివృద్ధి చెందుతాయని జగిత్యాల బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని 9,10 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్, టీఆర్‌ఎస్ హయాంలో నాయకులు రాష్ట్రాన్ని ఎంతో దోచుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు ధర్మపురి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, భూమేష్,మచ్చనారయణ,సురతాని మల్లారెడ్డి, గోపాల్, సంజీవ్, ఆశన్న రవి పాల్గొన్నారు.

అన్నగా అండగా నిలవండి

జగిత్యాలటౌన్/సారంగాపూర్: బహుజన వర్గాలకు చెందిన ఆడబిడ్డనైన తనకు పార్టీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిందని సీనియర్ నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి ఒక అన్నగా తనకు అండగా నిలిచి జగిత్యాలలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కలిసి రావాలిసిందిగా బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి విజ్ఞప్తి చేశారు. బుధవారం అర్పపల్లి గ్రామ పద్మశాలీ సేవాసంఘం అధ్యక్షుడు సాంబారి మల్లేశం ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరగా, శ్రావణి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోని అందరు నాయకులను కలుపుకుని పోయి జగిత్యాలలో బీజేపీ జెండా ఎగురవేస్తామని శ్రావణి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సారంగాపూర్ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, నాయకులు బద్దెల గంగరాజం, గొల్లపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పద్మశాలీ అభ్యర్థిని బరిలోకి దించుతాం



సమావేశంలో పాల్గొన్న పద్మశాలీ సంఘం నాయకులు

మెట్‌పల్లి: కోరుట్ల నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు పద్మశాలీలకు టికెట్ ఇవ్వకుంటే తమ వర్గానికి చెందిన వ్యక్తిని ఇండిపెండెంట్‌గా బరిలోకి దించాలని సంఘ నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన పద్మశాలీ సంఘ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ఓటర్లలో అత్యధికంగా పద్మశాలీలు ఉన్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ఎన్నికల్లో పద్మశాలీలకు టిక్కెట్లు కేటాయించాలని ప్రధాన పార్టీలకు దరఖాస్తు చేసినప్పటికీ రెండు పార్టీలు ఇతర వర్గాలకు ఇచ్చాయన్నారు. ఇంకా అభ్యర్థులను ఖరారు చేయని పార్టీలు పద్మశాలీకి కేటాయిస్తే సంఘం సంపూర్ణ మద్దతు తెలిపి గెలిపించుకుంటామన్నారు. లేనిపక్షంలో ఇండిపెండెంట్‌గా నిలబెట్టి ప్రధాన పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, నాయకులు రాజారాం, రాపెల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యం అందేదెప్పుడో?

- పశు వైద్యశాలల్లో సిబ్బంది కొరత
- సకాలంలో వైద్యం అందక మూగ జీవాల మృతి
- సబ్ సెంటర్లలో సైతం మందులు లేని వైనం



కప్పారావుపేటలో నిరుపయోగంగా గ్రామీణ పశువైద్యశాల (ఇన్‌సెట్‌లో) వెల్గటూర్ పశువైద్యశాల

వెల్గటూర్: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అంటారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందంటారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే పల్లెల్లో వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, జీవాల పెంపకానికి పెద్దపీట వేస్తున్నామని పాలకులు చెబుతున్నా వాస్తవాలు మరోలా ఉన్నాయి. గ్రామీణ పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత గ్రామీణ ప్రాంత రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. సబ్ సెంటర్లలో సిబ్బంది, మందుల కొరతతో సరైన వైద్యసేవలు అందక గ్రామీణ పశువైద్యశాలలు డీలా పడ్డాయి. పాడి పరిశ్రమ, జీవాల పెంపకంతో జీవనాధారం పొందుతున్న పాడి రైతుల పశువులు సరైన వైద్యం అందక మృతి చెందుతున్నాయి.

మండలంలో పశువైద్యశాలలు

వెల్గటూర్‌లో ప్రాథమిక పశువైద్య కేంద్రంతో పాటు మండలంలో కప్పారావుపేట, పైడిపెల్లి, అంబరిపేట, ఎండపల్లిలో నాలుగు సబ్ సెంటర్లు ఉన్నాయి. మండల పరిధిలో మొత్తం 11 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 7 గురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు సబ్ సెంటర్ల పరిధిలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ పోస్టులు నాలుగు ఖాళీగా ఉన్నాయి. ఇందులో వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించి నాలుగు సబ్ సెంటర్ల పరిధిలో అటెండర్లుగా నియమించడంతో ఈ నాలుగు పోస్టులు భర్తీ అయ్యాయి. పశువైద్య సిబ్బంది లేక పాడి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కొర్తో పశువులకు అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో పశువైద్యాధికారి చేరుకునే లోపు పశువులు మృత్యువాత పడుతున్నాయి.

వేధిస్తున్న మందుల కొరత

గ్రామాల్లో నిత్యం పాడి అటెండర్లే వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ మొన్నటి వరకు తహసీల్దార్ ఆఫీస్‌లో విధులు నిర్వహించిన వీఆర్‌ఏలను అటెండర్లుగా నియమించడంతో వారికి పశువైద్యంపై కనీస అవగాహన లేదు. పాడి పశువుల్లో వచ్చే రోగాలతో అవి చనిపోయే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులు సోకినప్పుడు మందులు లేక ప్రైవేట్ దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. సబ్ సెంటర్లలో మందులు కూడా సరిపడా లేవు. మండలంలో సుమారు 9 వేల వరకు గేదెలు, 5 వేలకు పైగా ఆవులు, అలాగే గొర్రెలు, మేకలు కలిపి 48 వేల వరకు జీవాలు ఉండడంతో ఈ మందులు సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పశువైద్యశాలల్లో సరిపడా సిబ్బందిని నియమించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఉంటున్నాం



సిబ్బంది లేకపోవడంతో సిబ్బందిపై అదనపు భారం పడుతున్నా రైతులకు ఇబ్బందులు కలగకుండా వైద్యసేవలందిస్తున్నాం.అత్యవసర సమయంలో మాత్రం కొంత ఇబ్బందులు పడుతున్నా, రైతులు నష్టపోకుండా చాలావరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం స్పందించి సబ్ సెంటర్లలో ఖాళీగా ఉన్న సిబ్బందిని నియమిస్తే రైతులకు ఉపయోగకరంగాఉంటుంది.

– డా.శ్రీప్రియ, పశువైద్యాధికారి, వెల్గటూర్

'పార్టీకి నష్టం చేస్తే ఊరుకోను'



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

జగిత్యాలటౌన్: మరో పార్టీ అభ్యర్థికి లబ్ధి చేకూర్చేందుకే భోగ శ్రావణికి టికెటిచ్చారని బీజేపీ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్న తమను కనీసం సంప్రదించకుండా అనేక అవినీతి ఆరోపణలున్న వ్యక్తికి టికెట్ కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా జగిత్యాలలో కాపాడుకుంటూ వచ్చిన పార్టీని భూస్థాపితం చేయాలనే కుట్ర జరుగుతుందన్నారు. తాను పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకం కాదని, పార్టీని దెబ్బతీసేలా జరుగుతున్న కుట్రలను మాత్రమే వ్యతిరేకిస్తున్నానన్నారు. పార్టీని భ్రష్టుపట్టించాలని చూస్తే ఎంతవరకైనా వెళ్తానని, కార్యకర్తలు, నాయకులతో సమాలోచనలు చేసి అవసరమైతే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

కోరుట్ల: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం కోరుట్లలో మాట్లాడుతూ కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో మేడిగడ్డ బ్యారేజ్ సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేశారని నాసి రకం నిర్మాణలు చేశారని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగినప్పటికీ ప్రభుత్వపరంగా విచారణ సాగకపోవడం విడ్డూరమన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు లోపాలు సరిదిద్దకుంటే కోరుట్ల సెగ్మెంట్‌లోని కాకతీయ కెనాల్‌కు నీరు సరిగా రాదని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు అవినీతిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, ఎంఏ నయీం, వసీంలు పాల్గొన్నారు.

ఉమ్మడి వెల్గటూర్ మండల కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులతో లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్: వెల్గటూర్, ఎండపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని బుధవారం రాజారాంపల్లిలో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల యూత్, ఎస్సీ సెల్, బీసీ సెల్, మైనారిటీ సెల్ కమిటీలను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో వెల్గటూర్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, వెల్గటూర్ సర్పంచ్ మురళిగౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, ఎండపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మద్దుల గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి విజయ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, ఉప సర్పంచ్ సందీప్, తిమ్మాపూర్ సింగిల్ విండో డైరెక్టర్ కోటయ్య, నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠధామానికి దారేదీ?



కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామ శివారులో నిర్మించిన కల్వర్టు ఆ గ్రామస్తులకు కొత్త సమస్య తెచ్చిపెట్టింది. చింతకుంట నుంచి దుంపేట గ్రామానికి వెళ్లే రోడ్డులో ఒర్రె నీరు పోయేలా కల్వర్టు నిర్మించారు. ఈ కల్వర్టు నిర్మాణంతో చింతకుంట శివారులోని వైకుంఠధామానికి అడ్డుగా మారింది. సరైన దారి లేకపోవడంతో గ్రామస్తులు ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియల సమయంలో మృతదేహంతో వైకుంఠధామానికి వెళ్లడం ఇబ్బందిగా మారిందని స్థానికులు అంటున్నారు. అనాలోచితంగా కల్వర్టు నిర్మించడంతో వైకుంఠధామంకు సరిగా రోడ్డులేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారులు దృష్టిసారించి వైకుంఠధామానికి వెళ్లేలా రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం అధ్యక్షుడికి వినతి



కిషన్‌రెడ్డిని కలిసిన రాయిల్ల రవికుమార్

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని అధిష్టానంను కోరడం కోసం రాయిల్ల రవికుమార్ చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం 7వ రోజుకు చేరింది. బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామానికి చెందిన రాయిల్ల రవికుమార్ గత కొన్నేళ్లుగా బీజేపీలో క్రియాశీలకంగా పని చేస్తున్నాడు. స్థానికుడైన రవికుమార్‌కు బీజేపీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని అధిష్టానంను వేడుకుంటున్నాడు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, కిషన్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించాడు. అదే విధంగా హైదరాబాద్‌లో ఈటెల రాజేందర్, బండి సంజయ్‌లను కలిసి టికెట్ కోసం సహకరించాలని కోరినట్లు తెలిపాడు.

స్థలం లేక.. రోడ్డుపైనే పార్కింగ్



రోడ్డుపైనే నిలిపిన 108 అంబులెన్స్

జగిత్యాల: ఆపదలో క్షతగాత్రుల ప్రాణాలు రక్షించే 108 అంబులెన్స్‌కే స్థలం కరువైంది. జిల్లాలోని మేడిపల్లి మండల కేంద్రానికి ఇటీవల 108 అంబులెన్స్‌ను కేటాయించారు. కాగా, దానిని అక్కడ పార్కింగ్ చేసేందుకు సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో వీరు సంఘటన స్థలానికి వెళ్లి రోగులకు ఆస్పత్రిలో చేర్పిస్తుంటారు. ఇందులో రోగులకు ఫస్ట్ ఎయిడ్ కింద కొన్ని మందులు సైతం ఇస్తుంటారు. అక్కడ స్థలం లేకపోవడంతో మందులను సైతం అంబులెన్స్‌లోనే ఉంచుకుంటున్నారు. కొంత ఇబ్బందికరంగా మారిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ వద్ద పార్కింగ్ చేయడంతో ఏదైనా జరిగితే సిబ్బంది బాధ్యత వహించాల్సి వస్తుంది. పార్కింగ్ స్థలం కోసం వైద్యశాఖ అధికారులను అడిగినా వారు ససేమిరా ఒప్పుకోనట్లు తెలిసింది. అనంతరం జేసీ దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని మండల సిబ్బంది కోరుతున్నారు.

ఎమ్మెల్సీ రమణ కుమారుడి నిశ్చితార్థంలో కవిత



జగిత్యాల: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ కుమారుడు మణికంఠ నిశ్చితార్థం వేడుకలు హైదరాబాద్‌లో జరుగగా, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, టీఎస్‌ఫుడ్స్ చైర్మన్ రాజీవ్‌సాగర్ పాల్గొన్నారు.